క్లుప్తంగా

నిరసన ర్యాలీ

పుంగనూరు: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేసి హత్యచేసిన నిందితులను ఉరితీయాలని వాల్మీకి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన బాలిక హత్య కేసును ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నేతలు అద్దాల నాగరాజు, సుకుమార్, జయసింహ, మంజునాథ్, శంకరప్ప, వెంకటాద్రి, విశ్వనాథ్, రెడ్డెప్ప, మనోహర్, నరసింహులు, సుధాకర్ పాల్గొన్నారు.

శివానందపురానికి బస్సు


బస్సును ప్రారంభిస్తున్న నేతలు, అధికారులు

కుప్పంరూరల్: తమిళనాడు సరిహద్దులోని జిల్లా శివారు గ్రామమైన శివానందపురానికి సోమవారం ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుకు టీడీపీ కుప్పం ఇన్‌చార్జి మునిరత్నం పూజలు చేశారు. ఈ బస్సు అడవిబూదుగూరు, కడసీకొటాలు, యానాదిపురం మీదుగా శివానందపురం చేరుకుంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సత్యేంద్రశేఖర్, సాంబశివం, రామచంద్ర పాల్గొన్నారు.

జర్నలిస్ట్ మృతికి సంతాపం


శ్రీనివాస్ మొదలియార్

పుంగనూరు: పట్టణంలోని సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ మొదలియార్ (54) సోమవారం వేకువజామున కన్నుమూశారు. శ్వాస సమస్యతో ఉదయం ఇబ్బంది పడుతూ ఆస్పత్రికి వెళ్లేలోపు మరణించారు. ఆయన మృతికి పలువురు జర్నలిస్టులు సంతాపం తెలిపారు. శ్రీనివాస్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

విద్యాసామగ్రి కిట్‌ల పంపిణీ


కిట్ అందిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు సోమవారం విద్యా సామగ్రి కిట్‌లను పంపిణీ చేశారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతుఊ పిల్లలు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని కోరారు. అనంతరం ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్, ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నటరాజురెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరులో కందిపప్పు విక్రయ కేంద్రం

పుంగనూరు: పట్టణంలోని కోర్టు రోడ్డులో ఉన్న ప్రభు దాల్‌మిల్‌లో సోమవారం కందిపప్పు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రూ.165లకే కందిపప్పు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర సరుకుల ధరల నియంత్రణలో భాగంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో ప్రజలు నాణ్యమైన కందిపప్పును పొందవచ్చని సూచించారు.

కమనీయం ద్రౌపదీదేవి కల్యాణం


అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తున్న ఉభయకర్తలు

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె సమీపంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అమ్మవారి కల్యాణం కమనీయంగా సాగింది. ఈ సందర్భంగా ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హరికథా కాలక్షేపం చేపట్టారు. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధపరిమళాలు వెదజల్లే పుష్పమాలికలతో ముస్తాబు చేశారు. పండితుల వేదమంత్రాలు మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమానికి రాజేష్‌రెడ్డి, బాలాజీరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, తోయాక్షురెడ్డి, బాలాజీరెడ్డి పాల్గొన్నారు.





పెట్టుబడి రెండేళ్లు.. దిగుబడి 20 ఏళ్లు!

- రూ.లక్షలు కురిపిస్తున్న డ్రాగన్ ఫ్రూట్
- వినూత్నంగా 'సాగు'తున్న రైతు కుమారస్వామి
- నాలుగు ఎకరాల్లో ప్రయోగాత్మకంగా డ్రాగన్ తోట పెంపకం
- నెలకు రూ.3లక్షల వరకు ఆదాయం

కుప్పం మండలం కొత్తయిండ్లు గ్రామానికి చెందిన కుమారస్వామి వ్యవసాయంలో ప్రయోగాలకు పెద్దపీట వేశాడు. ఆయన సంప్రదాయ పంటలతో సరిపెట్టుకోలేదు.. వినూత్నంగా ఆలోచించాడు.. విభిన్న రకాలను అన్వేషించాడు.. అధిక ఆదాయం పొందే దిశగా అడుగులు వేశాడు.. డ్రాగన్ ఫ్రూట్ లాభదాయకమని నిర్ణయించుకున్నాడు.. అనుకున్నదే తడవుగా సాగు చేపట్టాడు.. కుప్పం నియోజకవర్గానికి తొలిసారిగా విదేశీ పంటను పరిచయం చేశాడు.. ఆసక్తికి చిత్తశుద్ధిని జోడించి నమ్మకంతో పెట్టుబడి పెట్టాడు.. ఇప్పుడు నెలకు రూ.లక్షలు ఆర్జిస్తున్నాడు.. ఎందరో రైతులకు ఆదర్శంగా నిలిచాడు.. మరెందరినో సరికొత్తగా సేద్యం చేసేలా ప్రేరణ కలిగించాడు.


కుమారస్వామి సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్

కుప్పంరూరల్: నియోజక వర్గంలో మొట్టమొదట డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసిన రైతుగా కుప్పం మండలం, కొత్తయిండ్లు గ్రామానికి చెందిన కుమారస్వామి పేరు పొందారు. చైనా నుంచి మన దేశానికి వచ్చిన డ్రాగన్ ఫ్రూట్ సాగును కుప్పానికి పరిచయం చేసింది మాత్రమం కుమారస్వామినే. కొత్త కొత్త వంగడాలు, పంటలపై ఆసక్తి చూపే ఆయన ఇంటర్‌నెట్‌లో డ్రాగన్ సాగు గురించి తెలుసుకున్నాడు.2022లో సాగు ప్రారంభించాడు. ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్ కోతకు రావడంతో కుమారస్వామి నెలకు రూ.3 లక్షల వరకు ఆదాయం పొందుతున్నాడు.

నాలుగు ఎకరాల్లో సాగు

మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్‌కు ఉన్న గిరాకీని కుమారస్వామి కనిపెట్టాడు. ముందుగా సూర్యాపేటకు వెళ్లి ఒక్కో మొక్క రూ.80 చొప్పున కొనుగోలు చేసి తీసుకువచ్చాడు. తనకున్న నాలుగు ఎకరాల్లో సాగు చేపట్టాడు. నీటి తీరువా తక్కువ ఉన్నా డ్రాగన్ మొక్క తట్టుకోవడం కుమారస్వామికి కలిసివచ్చింది. మొక్కల కొనుగోలు, సిమెంట్ దిమ్మెల నిర్మాణం, దిమ్మెలపై టైర్ల ఏర్పాటు, మొక్కలకు ఎరువులు అన్నీ కలిపి ఎకరాకు రూ.5 లక్షల వరకు ఖర్చు వచ్చింది. మొత్తం నాలుగు ఎకరాలకు గాను రూ.20 లక్షల వరకు పెట్టుబడి వ్యయం పెట్టాల్సి వచ్చింది.

తోటి రైతులకు దిశానిర్దేశం

డ్రాగన్ ఫ్రూట్ సాగులో కుమారస్వామి లాభాలు ఆర్జిస్తుండడంతో చుట్టు పక్కల గ్రామాల రైతులు కూడా దీనిపై ఆసక్తి చూపుతున్నారు. కుమారస్వామిని కలిసి పంట సాగు, ఖర్చులు, ఎరువుల వాడకం గురించి సలహాలు సూచనలు తీసుకుంటున్నారు. ఆయన తగిన విధంగా స్పందిస్తూ వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. మార్కెటింగ్, ప్రభుత్వ రాయితీలను సైతం వివరిస్తూ ప్రోత్సహిస్తున్నాడు.

రెండేళ్లకు మొదలైన కోత

2022లో సాగు ప్రారంభిస్తే 2024 జూన్ నుంచి డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి వస్తోంది. బెంగళూరు మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.120 వరకు పలుకుతోంది. పది రోజుల ఒకసారి పంట కోతకు వస్తోంది. ప్రతి కోతకు టన్ను వరకు ఫలసాయం అందుతోంది. దీంతో ఒక్క కోతకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోందని కుమారస్వామి చెబుతున్నాడు. పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే 20 ఏళ్ల పాటు దిగుబడి వస్తుందని వెల్లడిస్తున్నాడు. ఏటా జూన్ నుంచి నవంబరు వరకు ఆరునెలలపాటు పంట దిగుబడి ఉంటుంది. కుప్పం లాంటి నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంత రైతులకు డ్రాగన్ ఫ్రూట్ సాగు అనుకూలంగా ఉంటుందని కుమారస్వామి వివరిస్తున్నాడు.


మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా డ్రాగన్ ఫ్రూట్

ఈ ప్రాంతం చాలా అనుకూలం



కుప్పం ప్రాంతంలోని ఎర్ర, నల్లరేగడి నేలలు డ్రాగన్ ఫ్రూట్ సాగుకు చాలా అనుకూలం. ఇతర పంటల కంటే తక్కువ నీటితో సాగు చేయవచ్చు. ఒక్కసారి పెట్టుబడి పెడితే 20 ఏళ్లకు పైగా దిగుబడి పొందవచ్చు. బెంగళూరు, చెన్నైలో డ్రాగన్ ఫ్రూట్‌కు చక్కటి గిరాకీ ఉంది. ఇది కుప్పం ప్రాంత రైతులకు అనుకూలంగా ఉంటుంది.

–కుమారస్వామి, రైతు, కొత్తయిండ్లు

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థినులు


ఝాన్సీ హిమాగాత్రి, హిందుశ్రీ, గీతికాసాయి

గుడుపల్లె: మండలంలోని పెద్దపర్తికుంట గ్రామానికి చెందిన ఏకే ఝాన్సీ హిమాగాత్రి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు సంగనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదివిన ఝాన్సీ మొత్తం 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే ట్రిపుల్ ఐటీ మెరిట్ లిస్టులో 6 ర్యాంక్ సాధించిందని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన ఇద్దరు విద్యార్థినులు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నటరాజురెడ్డి తెలిపారు. గంగతిమ్మనపల్లికి చెందిన బి.హిందుశ్రీ, తుమ్మిశికి చెందిన వి.గీతికాసాయి ఉత్తమ మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందినట్లు వెల్లడించారు. విద్యార్థినులు తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు.

కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ సాయం


బాధితుడికి చెక్ అందిస్తున్న సునీల్‌కుమార్

పూతలపట్టు: టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త నిరంజన్‌కు పార్టీ ఆర్థిక సాయం అందించింది. ఎగువ పాలకూరుకు చెందిన నిరంజన్‌కు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ చిత్తూరులో చెక్కును అందజేశారు. బాధితుడిని పరామర్శించి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న భాస్కరన్

కుప్పంరూరల్: ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, ఇందుకోసం విరివిగా మొక్కలు నాటాలని ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ భాస్కరన్ తెలిపారు. సోమవారం వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని శికారీ కాలనీ వద్ద ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. భాస్కరన్ మాట్లాడుతూ చెట్లు నరికేయడం వల్ల భూతాపం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోతుందని తెలిపారు. అందుకే కరోనా సమయంలో ఆక్సిజన్ అందక చాలామంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. భావితరాలకు అలాంటి దుస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మాధవన్, ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్ పాల్గొన్నారు.

వేడుకగా 'బలి బండి కూడు'


బండి కూడుతో వెళుతున్న భీమ వేషధారి

కార్వేటినగరం : మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం వేడుకగా బలి బండి కూడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయంలో బకాసురునికి బండిలో కూడు తీసుకెళ్లి భీముడు సంహరించే ఘట్టాన్ని భాగవతారిణి రెడ్డెమ్మ హరికథా కాలక్షేపంలో కనులకు కట్టినట్టుగా వివరించారు. ఈ క్రమంలో సాయంత్రం భీమ వేషధారి ఎడ్ల బండిపై కూడు తీసుకెళ్లే సన్నివేశాన్ని ప్రదర్శించారు. ఈ ఘట్టం వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ మేరకు ఆలయంలో మూల మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

పుంగనూరులో మొహర్రం వేడుకలు

పుంగనూరు: పట్టణంలోని రాతిమసీదు వీధిలో సోమవారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లకు పూజలు చేసి, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సద్దాం హుస్సేన్, బాబాఫక్రుద్దీన్, అంజాద్, జావీద్, రిజ్వాన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు



వి.కోట: మండలంలోని దాసార్లపల్లెలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరుడిని ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం కూరగాయలతో అలంకరించారు. ఈ క్రమంలో ఉదయమే స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం శాకాంబరిగా విశ్వేశ్వరుడిని అలంకరించి కొలువుదీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బనకందొడ్డిలో 'ఫ్యామిలీ డాక్టర్'


రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని బనకందొడ్డిలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణిలు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు పీహెచ్‌సీ వైద్యాధికారి టి.మురళి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత నివారణ కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ అరుణకుమారి, ఏఎన్ఎం వసంత కుమారి, ఆశ కార్యకర్తలు వసుంధర, నారాయణమ్మ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

వి.కోట: స్థానిక ప్రైవేట్ బస్టాండ్ వద్ద సోమవారం వి.కోట గ్రేటర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేసినట్లు సంస్థ మండలాధ్యక్షుడు ధీరజ్ తెలిపారు. అంతర్జాతీయ సేవా సంస్థ వి.కోట లయన్స్ క్లబ్ సభ్యుల పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతినెల పేదలకు అన్నదాన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సురేంద్రగౌడ, తుకారం, నాగరాజేంద్ర, డాక్టర్ తమీమ్, మంజునాథ్, సోమశేఖర్, మురుగేష్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్లు.. నిర్మాణానికి సన్నాహాలు

- బైరెడ్డిపల్లెలో 6 కి.మీ. వి.కోటలో 10 కి.మీ మేర రహదారులు
- భూసేకరణ కోసం ఇప్పటికే గెజిట్ విడుదల చేసిన ఎన్‌హెచ్ అధికారులు
- నిధులు సైతం మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం
- అభ్యంతరాలపై రైతులతో నేడు సమావేశం


THE GAZETTE OF INDIA
EXTRAORDINARY
PART II-Section 3-Sub-Section(ii)
MINISTRY OF ROAD TRANSPORT AND HIGHWAYS
(GOVERNMENT OF INDIA)
New Delhi, the 28th June, 2024
PUBLIC NOTICE

భూ నిర్వాసిత రైతులకు హైవే అథారిటీ అధికారులు పంపిన నోటీసు

పలమనేరు: నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లె, వి.కోటలో బైపాస్ రోడ్ల నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం బైరెడ్డిపల్లె పరిధిలో భూములు కోల్పోయే రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. వి.కోట బైపాస్‌కు సంబంధించి కొన్ని సమస్యలు తలెత్తిన కారణంగా తొలుత బైరెడ్డిపల్లె రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమయే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం

బైరెడ్డిపల్లె తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశానికి హాజరుకావాలని 62 మంది భూ నిర్వాసిత రైతులకు ఇప్పటికే సమాచారం అందించారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ అధికారులు నోటీసులను అందజేశారు.

రూ.70 కోట్లతో పనులు.

జిల్లాలో బైపాస్‌రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.290 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో వి.కోట, బైరెడ్డిపల్లె బైపాస్ రోడ్లకు సంబంధించి భూసేకరణ, నిర్మాణానికి రూ.70 కోట్లు వెచ్చించనున్నారు. బైరెడ్డిపల్లె వద్ద 6 కిలోమీటర్లు, వి.కోటలో 10 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాగానే పనులకు త్వరలోనే టెండర్లను పిలవనున్నట్లు ఎన్‌హెచ్ డీఈ శివరామ్ తెలిపారు.


బైపాస్ రోడ్డు నిర్మించనున్న బైరెడ్డిపల్లె

భూసేకరణ ఇలా..

బైరెడ్డిపల్లెకు సంబంధించి పలమనేరు– వి.కోట మార్గంలో ఎడమవైపుగా నాలుగు లేన్ల బైపాస్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం బైరెడ్డిపల్లె, దేవదొడ్డి రెవెన్యూ గ్రామాల పరిధిలో 6 కిలోమీటర్ల మేర భూసేకరణ జరుగనుంది. అలాగే వి.కోట వద్ద నెర్నిపల్లె, పత్రపల్లె, పైపల్లె రెవెన్యూ గ్రామాల పరిధిలో 10 కిలోమీటర్ల మేర భూమిని సేకరించనున్నారు.

ఇక్కట్లు తప్పినట్టే..

ఇప్పటికే పలమనేరు––కుప్పం రోడ్డు విస్తరణ పనులు రూ.272 కోట్ల వ్యయంతో గతంలోనే చేపట్టారు. ఈ క్రమంలో బైరెడ్డిపల్లె, వి.కోట మండల కేంద్రాల్లో రోడ్లు మరీ ఇరుకుగా ఉండడంతో పలు దుకాణాలు, భవనాలను కూల్చివేయాలని గతంలో హైవే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సర్వే చేసి పలు భవనాలకు మార్కింగ్ సైతం ఇచ్చేశారు. అయితే ఇక్కడి వ్యాపారులు, యజమానులు దీనిపై పలుమార్లు జిల్లా అధికారులను కలసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి సమస్యలను ఆలకించిన గత ప్రభుత్వం బైరెడ్డిపల్లె, వి.కోటకు బైపాస్ రోడ్లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ మేరకు హైవే అధికారులను ఒప్పించి బైపాస్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టించింది. దీంతో ఈ రెండు మండల కేంద్రాల్లో ట్రాఫిక్ సమస్య తీరుతుంది.భారీ వాహనాలు మండలకేంద్రాల్లోకి రాకుండా బైపాస్‌లో వెళ్లనున్నాయి. మరోవైపు కొత్తగా నిర్మించనున్న బైపాస్ రోడ్ల పరిసరాల్లోని భూముల ధరలకు రెక్కలు రావడం గమనార్హం.

కలెక్టర్‌ను కలిసిన బోయకొండ ఆలయ ఈఓ


కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈఓ ఏకాంబరం

చిత్తూరు కలెక్టరేట్: బోయకొండ గంగమ్మ ఆలయ ఈఓ ఏకాంబరం సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం జేసీ శ్రీనివాసులు, డీఆర్ఓ పుల్లయ్యను కలిశారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ఆవుదేవర మీనాక్షి సమేత నందీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో నందీశ్వరుని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే డీఆర్ఎన్‌కండ్రిగ వద్ద అరుణగిరిపై వెలసిన కొండమల్లీశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.